క్లుప్తంగా

కిల్కారీ ద్వారా గర్భిణులు, శిశు ఆరోగ్యంపై అవగాహన

- డీఎంహెచ్ఓ బి.జగన్నాథరావు



డీఎంహెచ్ఓ బి. జగన్నాథరావు

పార్వతీపురం టౌన్: కిల్కారీ వాయిస్ ద్వారా గర్భిణులు, శిశువుల ఆరోగ్యంపై అవగాహన కల్పించనున్నారని జిల్లా వైద్యారోగ్యశాఖాధికారి బి.జగన్నాథరావు తెలిపారు. ఈ మేరకు ఆదివారం ఆయన తన కార్యాలయంలో విలేకరులతో మాట్లాడుతూ కేంద్ర ఆరోగ్య, కుటుంబ మంత్రిత్వశాఖ కిల్కారీ వాయిస్‌తో నాలుగు విభాగాల్లో సాంకేతిక ఆరోగ్య సందేశాలను అందించనున్నట్లు చెప్పారు. ఐవీఆర్ఎస్ ద్వారా 72 సందేశాలను అందిస్తుందని అందులో గర్భిణులు, శిశువుల ఆరోగ్యం, ఆస్పత్రి ప్రసవాలపై సందేశాలు మొబైల్ ఫోన్ ద్వారా వినిపిస్తుందని చెప్పారు. ఆశ కార్యకర్తల ద్వారా గర్భిణులకు కిల్కారీపై అవగాహన కల్పించామన్నారు.

నేడు గడప గడపకు..

మక్కువ: మండలంలోని దబ్బగెడ్డ గ్రామంలో సోమవారం గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ సూర్యనారాయణ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ కార్యక్రమానికి డిప్యూటీ సీఎం పీడిక రాజన్నదొర హాజరుకానున్నట్లు పేర్కొన్నారు.

ఉపాధ్యాయులకు షటిల్ బ్యాడ్మింటన్ టోర్నమెంట్



ఎంఈఓ శ్యామ్‌సుందర్ చేతులమీదుగా బహుమతి అందుకుంటున్న ఉపాధ్యాయుడు శ్రీనివాసరావు

మక్కువ: టీచర్స్ డే సందర్భంగా మండలంలోని వెంకటభైరిపురంలో ఎంఎస్ఆర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఆదివారం షటిల్ బ్యాడ్మింటన్ టోర్నమెంట్ నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన మండల విద్యాశాఖాధికారి శ్యామ్‌సుందర్ టోర్నమెంట్‌ను ప్రారంభించారు. టోర్నమెంట్‌లో డబుల్స్ విభాగంలో మరడ శ్రీనివాసరావు, దుర్గాప్రసాద్ ప్రథమ బహుమతి..గోపి, శ్రీరాములు ద్వితీయ బహుమతి సాధించారు. అలాగే సింగిల్స్ విభాగంలో చిరంజీవి, పాటూరు ఈశ్వరరావు మొదటి, రెండు స్థానాల్లో నిలిచారు. టోర్నమెంట్‌లో 30 మంది ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఆటో ఢీకొని వ్యక్తికి గాయాలు

పార్వతీపురం టౌన్: మండలంలోని బాలగుడబ గ్రామం సమీపంలో ఆదివారం రాత్రి ఆటో ఢీకొని ఓ వ్యక్తి గాయపడ్డాడు. ఈ ప్రమాదంపై జిల్లా ఆస్పత్రి అవుట్ పోస్టు పోలీసులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. బాలగుడబ గ్రామానికి చెందిన ముప్వల శంకర్రావు పని నిమిత్తం పార్వతీపురం పట్టణానికి బైక్‌పై వస్తుండగా యామలత పేరంటాలు గుడి సమీపంలో పార్వతీపురం నుంచి బాలగుడబ వైపు వస్తున్న ఆటో ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో శంకర్రావుకు తీవ్ర గాయాలవడంతో స్థానికులు పార్వతీపురం జిల్లా ఆస్పత్రికి తరలించారు. అవుట్ పోస్టు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ప్రభుత్వం పునరాలోచన చేయాలి

గుమ్మలక్ష్మీపురం: రాష్ట్రంలో ఉన్న బుడగ, జంగం, వాల్మీకి, బెంతొరియా, ఏనేటి కొందు సామాజిక వర్గాలకు చెందిన వారు కుల ధ్రువీకరణ పత్రం లేకుండానే వైఎస్సార్ చేయూత పథకానికి దరఖాస్తు చేసుకునేందుకు ప్రభుత్వం అవకాశం కల్పించింది. కేవలం సెల్ఫ్ డిక్లరేషన్‌తో దరఖాస్తులు స్వీకరిస్తే అనర్హులు ఈ పథకం పొందేందుకు వీలు కల్పించినట్లవుతుందని, దీనిపై ప్రభుత్వం పునరాలోచన చేయాలని ట్రైబల్ రైట్స్ ఫోరం రాష్ట్ర అధ్యక్షుడు రొబ్బ లోవరాజు కోరారు. ఈ మేరకు ఆదివారం ఒక ప్రకటన విడుదల చేశారు. కులధ్రువీకరణ పత్రం లేకుండా దరఖాస్తు చేసుకునేందుకు అనుమతివ్వడం వలన ఆయా కులాలకు చెందిన నిజమైన అర్హులకు అన్యాయం జరిగే అవకాశం ఉందని పేర్కొన్నారు.

రోడ్డు ప్రమాదాల నివారణకు చర్యలు



జంగిల్స్‌ను తొలగిస్తున్న ఎస్ఐ రమేష్

తెర్లాం: రోడ్డు ప్రమాదాల నివారణకు చర్యలు చేపడుతున్నట్లు ఎస్ఐ ఆర్.రమేష్ తెలిపారు. తెర్లాం–రాజాం, తెర్లాం–బొబ్బిలి ఆర్‌అండ్‌బీ రోడ్డులో పలు రోడ్డు మలుపుల వద్ద రోడ్డుకు ఇరువైపులా ఉన్న జంగిల్స్(తుప్పలు, డొంకలు)ను జేసీబీ సహాయంతో ఆదివారం తొలగించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రోడ్డుకు ఇరువైపులా బాగా పెరిగిన తుప్పలు, డొంకలు, చెట్లకొమ్మల కారణంగా ఎదురెదురుగా వచ్చే వాహనాలు కనిపించకపోవడంతో ప్రమాదాలు జరిగే ఆస్కారం ఉందని, దీన్ని దృష్టిలో ఉంచుకుని, జంగిల్స్ తొలగింపు చర్యలు చేపడుతున్నామన్నారు.

పోషకాహారంతో ఆరోగ్యం

- రోగనిరోధక శక్తి పెరుగుదల
- నియంత్రణలో వ్యాధులు



మార్కెట్లో విక్రయిస్తున్న తాజా కూరగాయలు

గుమ్మలక్ష్మీపురం:

రోగ నిరోధకశక్తిని పెంపొందించుకుంటే ఎలాంటి వ్యాధులనైనా జయించవచ్చు. రోజువారీగా శరీరానికి అవసరమైన పోషకాలతో కూడిన ఆహారం తీసుకుంటే రోగ నిరోధక శక్తి పెరిగి ఆరోగ్యంగా ఉండవచ్చు. ఇందు కోసం తాజా కూరగాయాలు, పండ్లు, పప్పు ధాన్యాలు, పాలు, మాంసకృత్తులు వంటి వాటిని తీసుకోవాల్సి ఉంటుంది. సరైన ఆహారపు అలవాట్లు లేకపోవడం, వ్యాయామానికి దూరంగా ఉండడం వల్లే పలువురు వ్యాధుల బారిన పడుతున్నారు. పోషకాహార ప్రాముఖ్యతను ప్రజలకు తెలియజేసేందుకు ఏటా సెప్టెంబరు నెలలో పోషకాహార వారోత్సవాలు/మాసోత్సవాలు నిర్వహిస్తున్నారు. ఈ నేపథ్యంలో ఆరోగ్యంగా ఉండేందుకు తీసుకోవాల్సిన జాగ్రత్తలు, పాటించాల్సిన ఆహారపు అలవాట్లపై రస్తాకుంటుబాయి కృషి విజ్ఞాన కేంద్రం(ఆచార్య ఎన్జీ రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం) గృహ విజ్ఞాన విభాగం శాస్త్రవేత్త వై.ఉమాజ్యోతి పలు సూచనలు చేశారు.

ఆహారపు అలవాట్లు

- ప్రతీ సారి భోజనానికి ముందు, తర్వాత సబ్బుతో చేతులను కడుక్కోవాలి. పరిశుభ్రమైన ఆహారం, కాచి వడబోసిన నీరు తీసుకోవడం వల్ల వ్యాధుల బారి నుంచి తప్పించుకోవచ్చు.
- ఆహారాన్ని ఒకేసారి ఎక్కువగా కాకుండా ప్రతీ మూడు గంటలకొకసారి కొంచెం కొంచెంగా తీసుకుంటే మంచిది.
- రోజు వారీ ఆహారంలో తాజా ఆకుకూరలు, కూరగాయలు, పండ్లు ఉండేలా చూసుకోవాలి. కూరగాయలు, పండ్లలో ఉండే సూక్ష్మ పోషక పదార్థాలు, ఫైబర్ శరీరానికి ఎంతో మేలు చేస్తాయి.
- పసుపు, నారింజ రంగులో ఉండే పండ్లు కొన్ని రకాల దీర్ఘకాలిక జబ్బులను నిరోధిస్తాయి. తాజాగా ఉండే పచ్చికూరగాయలు, పండ్లను జూస్ రూపంలోనైనా తీసుకోవచ్చు.

రోజుకు ఐదుసార్లు..

- ఉదయం టిఫిన్‌లో రెండు ఇడ్లీలు లేదా 60 గ్రాముల గింజ ధాన్యాలు లేదా 25 గ్రాముల పప్పులు, 150 మిల్లీలీటర్ల పాలు తీసుకోవాలి.
- 11 గంటల సమయంలో ఒక పండు, నిమ్మ రసం లేదా జామకాయ తీసుకోవాలి. ఇవి అందుబాటులో లేకుంటే ఒక గ్లాస్ పాలైనా తాగాలి.
- మధ్యాహ్నం భోజనంలో 75 గ్రాముల గింజ ధాన్యాలు (మూడు కప్పుల అన్నం లేదా పుల్కాలు), ఆకు కూరగాయలు, పెరుగు ఉండేలా చూసుకోవాలి.
- సాయంత్రం 5గంటలకు 50 గ్రాముల గింజ ధాన్యాల చిరుతిండి, ఒక గ్లాస్ పాలు తీసుకోవాలి.
- రాత్రి భోజనంలో రెండు కప్పుల అన్నం లేదా 3 పుల్కాలు కూరగాయలతో తినాలి. ఒక వేళ పెరుగు, కూరగాయలు వద్దనుకుంటే 100 గ్రాముల మాంసాహారం ఉండాలి. 50 గ్రాముల పండ్ల రసాన్ని తీసుకోవాలి.

నీరు, పాలకు ప్రాధాన్యం

పరిశుభ్రమైన నీటినే తాగాలి. సరిపడా నీరు తాగితే 50 శాతం రుగ్మతలకు దూరంగా ఉండవచ్చు. ఎక్కువగా కాచివడబోసిన నీటిని తాగాలి. నీటితో పాటు పాలు కూడా ఎంతో అవసరం. రోజుకు 250 మిల్లీ లీటర్ల పాలు తాగాలి. కాఫీ, టీ అలవాటు ఉన్న వారు రోజుకు ఒకటి రెండు సార్లు కంటే ఎక్కువగా తీసుకోరాదు. కాఫీ కంటే టీ మంచిది.

పప్పు ధాన్యాలకు కూడా..

ఆహారంలో పల్లీలు, మినుములు, శనగలు, బాదం, పప్పు ధాన్యాలు వంటివి ఏదో ఒకటి ఉండేలా జాగ్రత్తలు తీసుకోవాలి. ఏదైనా బాగా ఉడికించి తినాలి. ప్రతీ రోజూ వంద గ్రాములు ఏదో ఒక ఆకు కూర ఉండేలా చూసుకోవాలి. నిమ్మ, జామ, దానిమ్మ, ఉసిరి ఏదో ఒక దానికి తప్పకుండా తీసుకోవాలి. రోజూ ఉడికించిన గుడ్లు, వారంలో ఒకసారి చికెన్, మటన్ తీసుకోవాలి.

వీటికి దూరంగా ఉండాలి

నిలువ చేసిన ఆహారం, తీపి పదార్థాలు తీసుకోకూడదు. బయట దొరికే రెడీమేడ్ ఆహారం, ఉప్పుతో కూడిన ఆహారం, కూల్ డ్రింక్‌లు, ఫ్రిజ్‌లో ఉంచిన ఆహార పదార్థాలు తీసుకోరాదు.

త్వరితగతిన అభివృద్ధి

- జిల్లాలో 3356 పనులకు రూ.78.60 కోట్లు మంజూరు
- జీఎస్‌డబ్ల్యూఎస్ జిల్లా అధికారి రామచంద్రరావు



పార్వతీపురంటౌన్: త్వరితగతిన అభివృద్ధి పనులు పూర్తి చేసేందుకు చర్యలు చేపట్టామని జీఎస్‌డబ్ల్యూఎస్ (గ్రామ సచివాలయం/వార్డు సచివాలయం) జిల్లా అధికారి కె.రామచంద్రరావు అన్నారు. ఈ మేరకు ఆదివారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో వచ్చిన అర్జీలను జీఎస్‌డబ్ల్యూఎస్ ఆధ్వర్యంలో ప్రభుత్వానికి నివేదికలు పంపించామన్నారు. జిల్లాలో 3356 పనులకు రూ.78.60 కోట్లు నిధులు ప్రభుత్వం మంజూరు చేసిందని వాటిని త్వరితగతిన ఖర్చు చేసి పనులు పూర్తిచేసేందుకు చర్యలు చేపట్టామన్నారు. గ్రామాలు, పట్టణాల్లో తాగునీటి సమస్యల పరిష్కారానికి, తాగునీటి సరఫరాకు, నీటి నిల్వ చేసే ట్యాంకు నిర్మాణానికి, సురక్షిత మంచినీటికి తొలి ప్రాధాన్యం ఇవ్వనున్నట్లు వివరించారు. రహదారుల అభివృద్ధి సీసీ, బీటీ రహదారుల నిర్మాణం, మరమ్మతులకు నిధులను కేటాయించారని వివరించారు.

శరవేగంగా వంద పడకల ఆస్పత్రి నిర్మాణం



నిర్మాణంలో ఉన్న భవనం

సాలూరు: మున్సిపాలిటీలో వంద పడకల ఆస్పత్రి నిర్మాణ పనులు శరవేగంగా జరుగుతున్నాయి. సాలూరు, పాచిపెంట, మక్కువ, తదితర ప్రాంతాల ప్రజలతో పాటు ఒడిశా నుంచి వచ్చే రోగులకు ఈ ఆస్పత్రి ఎంతో ఉపయోగపడనుంది. ఏజెన్సీ ప్రాంతంలో వంద పడకలర ఆస్పత్రి అవసరమని భావించిన గిరిజన శాఖా మంత్రి పీడిక రాజన్నదొర ముఖ్యమంత్రి జగన్ మోహన్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లి రూ. 17 కోట్ల నాబార్డు నిధులు మంజూరు చేయించారు. కొన్నాళ్ల కిందట మంత్రి బొత్స నిర్మాణ పనులకు శంకుస్థాపన చేపట్టగా.. ప్రస్తుతం పనులు జోరుగా సాగుతున్నాయి. శ్లాబు పూర్తవడంతో మిగిలిన పనులను కూడా సంబంధి త కాంట్రాక్టర్ వేగవంతంగా చేపడుతున్నారు. ఈ ఏడాది ఆఖరులోగా భవనాన్ని ప్రారంభించేలా చ ర్యలు తీసుకుంటున్నట్లు మంత్రి రాజన్నదొర తెలిపారు.

ప్లాస్టిక్ నిషేధం అతిక్రమిస్తే చర్యలు

- మున్సిపల్ కమిషనర్ రామప్పలనాయుడు



సమావేశంలో మాట్లాడుతున్న మున్సిపల్ కమిషనర్ రామప్పలనాయుడు

పార్వతీపురం టౌన్: ప్లాస్టిక్ నిషేధాన్ని అతిక్రమిస్తే చర్యలు తప్పవని మున్సిపల్ కమిషనర్ రామప్పలనాయుడు హెచ్చరించారు. ఈ మేరకు ఆదివారం స్థానిక మున్సిపల్ కార్యాలయంలో ఆచప విలేకరులతో మాట్లాడుతూ ప్లాస్టిక్ నిషేధాన్ని అతిక్రమిస్తే అపరాధ రుసుముతో పాటు చర్యలు ఉంటాయని స్పష్టం చేశారు. ప్లాస్టిక్ నిషేధంపై వ్యాపారస్తులు అవగాహన కలిగి ఉండాలని సూచించారు. క్లీన్ పార్వతీపురంగా తీర్చిదిద్దేందు ప్రతిఒక్కరూ సహకరించాలని కోరారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు సింగిల్ యూజ్ ప్లాస్టిక్ వస్తువులను నిషేధించినట్లు తెలిపారు. వ్యాపారస్తులు వాటిని విక్రయిస్తే జరిమానా విధించి సరుకు స్వాధీనం చేసుకుంటామని పేర్కొన్నారు. పలుమార్లు పట్టుబడితే లైసెన్సులు రద్దు చేస్తామని హెచ్చరించారు.

పుస్తక పఠనం అలవాటు చేసుకోవాలి



తెర్లాం: విద్యార్థితో పుస్తకం చదివిస్తున్న లైబ్రేరియన్ కృష్ణమూర్తి

తెర్లాం: ప్రాథమిక పాఠశాల స్థాయి నుంచే ప్రతీ విద్యార్థి పుస్తక పఠనాన్ని అలవాటు చేసుకోవాలని లైబ్రేరియన్ సీహెచ్ కృష్ణమూర్తి తెలిపారు. చదవడం మాకిష్టం కార్యక్రమంలో భాగంగా స్థానిక శాఖా గ్రంథాలయంలో విద్యార్థులతో పుస్తక పఠనం చేయించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ పుస్తక పఠనం ద్వారా అపారమైన విజ్ఞానం కలుగుతుందని, చిన్నప్పటి నుంచే పుస్తకాలు చదవడాన్ని అలవాటుగా చేసుకోవాలన్నారు. అనంతరం విద్యార్థులకు వక్తృత్వ, వ్యాసరచన, క్విజ్ పోటీలు నిర్వహించారు.

పుస్తకాల వితరణ..

బాడంగి: స్థానిక శాఖా గ్రంథాలయానికి రామభద్రపురం మండలంలోని రావివలసకు చెందిన టి.గౌరీ శంకర్, బాడంగికి చెందిన వై.శ్రీరామ్ కలిసి పోటీ పరీక్షలకు సంబంధించిన పలు పుస్తకాలను వితరణ చేశారు. అనంతరం వారు మాట్లాడుతూ ఇదే గ్రంథాలయంలో చదువుకుని, తాము ఉద్యోగాలు సాధించామని, దానికి కృతజ్ఞతగా తమవంతు సాయం చేస్తున్నామని, ఇది తమకు సంతోషాన్నిస్తోందన్నారు. ఈ సందర్భంగా వారికి లైబ్రేరియన్ ఆర్.దుర్గాప్రసాద్ కృతజ్ఞతలు తెలిపారు.

రోడ్డు భద్రత నిబంధనలు పాటించాలి

పాలకొండ: వాహన చోదకులు రోడ్డుభద్రత నిబంధనలు పాటించాలని సీఐ మురళీధర్ అన్నారు. పట్టణంలోని పలు కూడళ్లలో ఆదివారం వాహన తనిఖీలు చేపట్టారు. ట్రాఫిక్ రూల్స్‌పై వాహన చోదకులకు అవగాహన కల్పించారు. లైసెన్స్, సరైన వాహన ధ్రువపత్రాలు లేకుండా వాహనాలు నడిపే వారిపై అపరాధ రుసుం విధించారు. మైనర్లకు వాహనం నడిపేందుకు ఇస్తే సంబంధిత యజమానిపై కేసు నమోదు చేయడం జరుగుతుందని, మద్యం తాగి వాహనాలు నడిపితే చర్యలు తప్పవని హెచ్చరించారు.

లోవోల్టేజీ సమస్య పరిష్కారం

భామిని: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన 'గడపగడపకు మన ప్రభుత్వం' కార్యక్రమంలో అర్హులకు సంక్షేమ పథకాలతో పాటు ప్రజా సమస్యలు పరిష్కారమవుతున్నాయి. నేరడి–బిలో జరిగిన కార్యక్రమంలో స్థానిక కొత్తవీధిలో లోవోల్టేజీ సమస్యను స్థానికులు ఎమ్మెల్యే కళావతి దృష్టికి తీసుకురావడంతో ఆమె సమస్యను పరిష్కరించాలని విద్యుత్ అధికారులను ఆదేశించారు. దీంతో అధికారులు కొత్తవీధిలో అదనపు విద్యుత్ లైన్, ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు చేసి లోవోల్టేజీ సమస్యను పరిష్కరించారు.

సీఎం జగన్‌కు రుణపడి ఉంటాం..

పాలకొండ రూరల్: అర్హతే ప్రామాణికంగా పింఛన్ మంజూరు చేసిన సీఎం జగన్‌కు రుణపడి ఉంటామని కొత్తగా పింఛన్ పొందిన లబ్ధిదారులు అంటున్నారు. మండలంలోని ఎం.సింగుపురం, లుంబూరు గ్రామాల్లో కొత్తగా పింఛన్లు మంజూరైన లబ్ధిదారులకు సర్పంచ్‌లు రణస్థలం రమాదేవి, తిర్లంగి ఉపేంద్రకుమార్ నగదు పంపిణీ చేశారు. గత ప్రభుత్వాలు సంక్షేమ ఫలాలు అందించాలంటే రాజకీయాలకు ప్రాధాన్యత ఇచ్చేవని, కానీ జగనన్న ప్రభుత్వంలో అర్హతే కొలమానమని ప్రజా ప్రతినిధులు స్పష్టం చేశారు. కార్యక్రమాల్లో మండల వ్యవసాయ సలహా మండలి అధ్యక్షుడు రణస్థలం రాంబాబు, వాసునాయుడు తదితరులు పాల్గొన్నారు.

నిరుద్యోగ యువతను కేంద్రం మోసం చేసింది..

బొబ్బిలి: తాము అధికారంలోకి వస్తే రెండు కోట్ల ఉద్యోగాలిస్తామని ప్రకటించిన కేంద్రంలోని ఎన్‌డీఏ ప్రభుత్వం ఉద్యోగాలు ఇవ్వకుండా నిరుద్యోగ యువతను మోసం చేస్తోందని సీపీఎం జిల్లా కార్యదర్శి పొట్నూరు శంకరరావు, ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి రామ్మోహన్ విమర్శించారు. స్థానిక ఫ్లైఓవర్ బ్రిడ్జి వద్ద ఉన్న వసతిగృహంలోని విద్యార్థులతో ఆదివారం నిర్వహించిన సదస్సులో మాట్లాడిన వారు ఎన్నికలకు ముందు ఎన్నో హామీలు ఇచ్చిన మోదీ సర్కారు అధికారంలోకి వచ్చాక వాటిని విస్మరించారని ఆరోపించారు. అలాగే గద్దెనెక్కిన దగ్గర నుంచి వారు చేపట్టినవన్నీ ప్రజావ్యతిరేక విధానాలేనని దుయ్యబట్టారు. నోట్ల రద్దు, జీఎస్టీ అమలు, నల్ల వ్యవసాయ చట్టాలు, ఇంధన ధరల పెంపు అన్నీ ప్రజాగ్రహం తెప్పించినవేనని ధ్వజమెత్తారు. ఇప్పుడు అగ్నిపథ్ పేరిట నిరుద్యోగులకు తాత్కాలిక ఉద్యోగాలు కల్పించి, చేతులుదులుపుకునే ప్రయత్నం కేంద్రం చేస్తోందని, వచ్చే ఎన్నికల్లో ఆ పార్టీకి తగిన బుద్ధి చెప్పాలని కోరారు.

పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత

రాజాం: పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత అని శిష్టకరణ సంక్షేమ సంఘం రాజాం ప్రాంతీయ అధ్యక్షుడు పక్కి వాసు అన్నారు. మండలంలోని మెంటిపేట దగ్గరున్న శిష్టకరణాల కమ్యూనిటీ హాల్ వద్ద పలు కుటుంబాలకు ఆదివారం మొక్కలు పంపిణీ చేశారు. మరికొన్ని మొక్కలను కమ్యూనిటీ హాల్ వద్ద నాటారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మొక్కల పెంపకంతోనే మానవ మనుగడ సాధ్యమని, ప్రతిఒక్కరూ తమవంతు బాధ్యతగా ఓ మొక్క నాటి దానిని సంరక్షించాలన్నారు. శిష్టకరణ సంక్షేమ సంఘం కుటుంబాల ఆర్థికాభివృద్ధితో పాటు సామాజిక అభివృద్ధిలో కూడా బాగస్వామ్యం కావాలని పిలుపునిచ్చారు. గ్రామాల్లో పలు సేవా కార్యక్రమాల్లో సంఘ సభ్యులు పాల్గొనాలని కోరారు. కార్యక్రమంలో సంఘ కార్యదర్శి కుప్పిలి రమేష్, వైస్ ప్రెసిడెంట్ కల్లేపల్లి శ్రీనివాసరావు, ఉరిటి జగదీశ్వరరావు, బలివాడ నాగేశ్వరరావు, కొండవలస మధుసూదనరావు తదితరులు పాల్గొన్నారు.

ఆస్పత్రిలో పింఛన్ అందజేత



ఆస్పత్రిలో బెడ్‌పై ఉన్న దివ్యకు పింఛన్ అందజేస్తున్న వలంటీర్ ప్రియాంక



పార్వతీపురం టౌన్: సింహాచలానికి విశాఖలో పింఛన్ అందజేస్తున్న వలంటీర్ మల్లేష్

సీతానగరం: మండలంలోని లచ్చయ్యపేట గ్రామానికి చెందిన పింఛన్ లబ్ధిదారు గుంట దివ్య విజయనగరంలోని సర్వజన ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న కారణంగా గ్రామ వలంటీర్ ఎం.ప్రియాంక ఆదివారం ఉదయం ఆస్పత్రికి వెళ్లి పింఛన్ అందజేసింది. ఈ సందర్భంగా లబ్ధిదారు దివ్య మాట్లాడుతూ తాను అనారోగ్యానికి గురై విజయనగరంలో చికిత్స పొందుతున్నానని వ్యాధి నివారణకు డాక్టర్లు అన్ని చర్యలు తీసుకుంటువన్న సయయలో ఆర్థిక ఇబ్బందులు పడుతున్న తనకు జగనన్న పింఛన్ కానుకను వలంటీర్ ప్రియాంక విజయనగరం వచ్చి అందజేయడం అభినందనీయమని సంతోషం వెలిబుచ్చింది. కష్టాల్లో ఉన్న తనను పింఛన్ రూపంలో ఆదుకున్న జగనన్నకు రుణపడి ఉంటానని కృతజ్ఞతలు తెలియజేసింది.

విశాఖపట్నం వెళ్లి..

పార్వతీపురం టౌన్: పార్వతీపురం పట్టణంలోని 16వ వార్డుకు చెందిన వలంటీర్ బి.మల్లేష్ తన క్లస్టర్ పరిధిలోని పింఛన్ లబ్ధిదారు విశాఖ కేజీహెచ్‌లో చికిత్స పొందుతుండగా అక్కడికి వెళ్లి పింఛన్ అందజేశాడు. లబ్ధిదారు యేగిరెడ్డి సింహాచలం ఆరోగ్య బాగులేకపోవడంతో ఫించన్ మొత్తం అవసరాలకు ఉపయోగపడతాయని భావించిన వలంటీర్ తన సొంత ఖర్చులతో విశాఖ వెళ్లి పింఛన్ అందజేసి అంకిత భావంతో విధులు నిర్వహించాడు.

నాణ్యతా ప్రమాణాలతో ఇంటింటి కుళాయి పనులు



మాట్లాడుతున్న ఆర్‌డబ్ల్యూఎస్ డీఈ హనుమంతరావు

సీతానగరం: మండలంలోని గాదెలవలస గ్రామంలో జేజేఎం నిధులతో ఇంటింటి కుళాయిల నిర్మాణం నాణ్యతా ప్రమాణాలకు లోబడి చేపట్టాలని ఆర్‌డబ్ల్యూఎస్ డీఈ హనుమంతరావు కోరారు. ఈ మేరకు ఆదివారం ఆయన ఏఈ పవన్‌కుమార్‌తో కలిసి గాదెలవలసలో జరుగుతున్న ఇంటింటి కుళాయిల ఏర్పాటు కోసం కాంట్రాక్టర్ సమకూర్చిన పైపులు, ట్యాప్‌లను పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఎమ్మెల్యే అలజంగి జోగారావు కృషి ఫలితంగా నియోజక వర్గంలోని మూడు మండలాల్లో ఇంటింటి కుళాయిల నిర్మాణం వేగవంతం చేసినట్లు చెప్పారు. ఏఈ పవన్‌కుమార్ మాట్లాడుతూ అంటిపేటలో రూ.37 లక్షలతో చేపట్టిన ఇంటింటి కుళాయిల నిర్మాణం పూర్తి కావడంతో ట్యాప్ల ద్వారా ఇళ్లకు తాగునీరు సరఫరా చేస్తున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో గాదెలవలస సర్పంచ్ బి. తిరుపతిరావు, పంచాయతీ కార్యదర్శి శోభాషణరావు పాల్గొన్నారు.

పేదల సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం



రైస్‌కార్డులు పంపిణీ చేస్తున్న జెడ్పీటీసీ ఎం.బాబ్జీ

సీతానగరం: పేదల జీవన ప్రమాణాలు మెరుగు పర్చడానికే ప్రభుత్వం సంక్షేమ పథకాలు ప్రవేశపెట్టిందని జెడ్పీటీసీ ఎం.బాబ్జీ అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం కొత్తగా మంజూరు చేసిన రైస్‌కార్డులను ఆదివారం ఆయన లచ్చయ్యపేటలో సర్పంచ్ సీహెచ్ కృష్ణ, ఎంపీటీసీ ఏ సింహాచలంతో కలిసి పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ అర్హులైన ప్రతి కుటుంబానికి సంక్షేమ పథకాలు అందజేయాలని ప్రతి నిరుగ్యోగికి స్వయం ఉపాధి కల్పించాలన్న సంకల్పంతో పార్వతీపురం ఎమ్మెల్యే అలజంగి జోగారావు ఆధ్వర్యంలో గ్రామాల్లో సుదీర్ఘకాలం నిర్వహించిన గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమాలతో పాటు జగనన్న సురక్ష గ్రామసభల ద్వారా అధికారులు లబ్ధిదారుల ఎంపిక నిర్వహించారన్నారు. పంచాయతీ కార్యదర్శి మురళి, వెల్ఫేర్ సహాయకులు, వీఆర్వో కిరణ్ పాల్గొన్నారు.

సెకెండ్ సెమిస్టర్ పుస్తకాల పంపిణీ పూర్తి

- డీఈఓ ఎస్.ప్రేమ్‌కుమార్



పార్వతీపురం టౌన్: విద్యార్థులకు సెకెండ్ సెమిస్టర్ పుస్తకాల పంపిణీ శతశాతం పూర్తి చేశామని పార్వతీ పురం మన్యం జిల్లా విద్యాశాఖాధికారి ఎన ప్రేమ్‌కుమార్ అన్నారు. ఈ మేరకు ఆదివారం ఆయన మాట్లాడుతూ గతంలో పాఠ్యపుస్తకాల పంపిణీ ఆలస్యంగా జరిగేదని ప్రస్తుతం ప్రభుత్వం ముందస్తు చర్యలు చేపట్టడంతో పాఠ్యపుస్తకాలను సకాలంలో పంపిణీ చేశామన్నారు. దీనివల్ల విద్యార్థులకు ఎంతో ఉపయోగ ఉంటుందని, ప్రభుత్వ ఆదేశాల మేరకు విద్యార్థుల అభ్యున్నతికి అన్ని రకాల చర్యలు చేపట్టామని తెలిపారు. జిల్లాలోని 15 మండలాల్లో 1584 గల ప్రభుత్వ పాఠశాలల్లో 94,725 మంది విద్యార్థులకు పుస్తకాలు పూర్తిస్థాయిలో అందజేశామని వింరించారు.

మండలాల వారీగా పుస్తకాల పంపిణీ వివరాలు

మండలం	పుస్తకాలు అందుకున్న విద్యార్థులు
బలిజిపేట	3585
భామిని	4917
గుమ్మలక్ష్మీపురం	9001
గరుగుబిల్లి	39057
జియ్యమ్మవలస	4269
కొమరాడ	5724
కురుపాం	7742
మక్కువ	4968
పాచిపెంట	7206
పాలకొండ	4817
పార్వతీపురం	9148
సాలూరు	10984
సీతంపేట	10306
సీతానగరం	3557
వీరఘట్టం	4543

ట్రాఫిక్ నిబంధనలు పాటించాలి



ఆటోడ్రైవర్లకు అవగాహన కల్పిస్తున్న ఎస్సై పాపారావు

పార్వతీపురం టౌన్: పట్టణం, గ్రామాల్లో ప్రయాణికులకు సేవలందించే ఆటో డ్రైవర్లు విధిగా నిబంధనలు పాటించాలని పార్వతీపురం ట్రాఫిక్ ఎస్సై పాపారావు అన్నారు. ఈ మేరకు స్థానిక బస్టాండ్ కూడలి వద్ద ఆదివారం ఆటో డ్రైవర్లకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రయాణికులకు అసౌకర్యం కలిగించినా, వారితో అమర్యాదగా ప్రవర్తించినట్లు తమ దృష్టికి వస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. ఓవర్‌లోడ్ ఎక్కించరాదని ధనాపేక్షతో కాకుండా, మానవతా దృక్పథంతో వ్యవహరించాలని హితవు పలికారు. వాహనపత్రాలు అందుబాటులో ఉంచుకోవాలని, లేకుంటే చట్టపరంగా అపరాధ రుసుం విధిస్తామని ట్రాఫిక్ ఎస్సై స్పష్టం చేశారు. వివిధ మార్గాల్లో సంచరించే ఆటోల వివరాలను ఆయా స్టాండ్‌ల వద్ద ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. అవగాహన సదస్సులో ట్రాఫిక్ సిబ్బంది పాల్గొన్నారు.